క్లుప్తంగా

యువకుడిపై కేసు నమోదు

గుడ్లూరు: యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన మాధవరావు అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాదరెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాళ్లపాడు గ్రామానికి చెందిన దగ్గుమాటి సుబ్బారావు శనివారం రాత్రి పొలంలో ఉన్న పచ్చిగడ్డి మోపును బైక్‌పై పెట్టుకొని ఇంటికి వస్తుండగా గ్రామానికి చెందిన కొల్లూరు మాధవరావు బైక్ అడ్డం వచ్చి కర్రతో సుబ్బారావుపై దాడి చేసి తలపై కొట్టాడు. దీంతో సుబ్బారావు కేకలు వేస్తూ కింద పడిపోయాడు. పక్కనే పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి రావడంతో మాధవరావు పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన సుబ్బారావును కుటుంబ సభ్యులు కందుకూరులోని వైద్యశాలకు తరలించారు. సుబ్బారావు ఫిర్యాదు మేరకు మాధవరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాదరెడ్డి పేర్కొన్నారు.

స్పందన రద్దు

కందుకూరు రూరల్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున సోమవారం జరిగే స్పందన రద్దు చేసినట్లు సబ్ కలెక్టర్ శోభికా తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు స్పందన కార్యక్రమం ఉండదన్నారు.

దేవాలయ పనులు పరిశీలించిన డీఎస్పీ



ఆలయం పై కప్పు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎస్పీ

కందుకూరు అర్బన్: అంకమ్మతల్లి దేవాయలం పునఃనిర్మాణ పనులను డీఎస్పీ కండే శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. రాతితో జరుగుతున్న ఆలయ నిర్మాణ కప్పును పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన వివరాలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ శిల్ప సౌందర్యం అద్భుతంగా ఉందని కమిటీ సభ్యులను అభినందించారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



ప్రభాకర్ మృతదేహం

టంగుటూరు: ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక రైల్వే గేటు వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు..బాపట్ల జిల్లా జాండ్రపేటకు చెందిన ప్రభాకర్ టంగుటూరులో ఒక దుకాణంలో పనిచేస్తుంటాడు. ఉదయం రైలు గేటు దాటుతుండగా ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనపై రైల్వే ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు తరలించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



చదవడం మాకిష్టంలో పాల్గొన్నవిద్యార్థులు

టంగుటూరు: పిల్లలు పుస్తకాలు చదివే విధంగా అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మక పెంపొందించేలా పుస్తక పఠనం అలవాటు చేయాలన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

చీరాల అర్బన్: విద్యుత్ తీగలు తగలడంతో ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి దగ్ధమైన ఘటన ఆదివారం సంపత్‌నగర్ వద్ద చోటుచేసుకుంది. సుమారు మూడు ఎకరాల వరిగడ్డిని ఆదివారం తీసుకెళ్తుండగా సంపత్‌నగర్ కాలనీ వద్ద విద్యుత్ తీగలు వరిగడ్డికి తగలడంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. వెంటనే గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ.25 వేలు నష్టం వాటిల్లించగా ఈ మేరకు వివరాలు నమోదు చేసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వేటపాలెం: పందిళ్లపల్లిలోని గంగా పార్వతి సమేత పునుగు రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో మణికంఠ సేవా సమితి సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుంటూరు నీరజ న్యూరో కేర్ వైద్యశాల డాక్టర్ కోటి నీరజ, సీతారం, గాయిత్రిలు 300 మందికి పరీక్షలు నిర్వహించారు.

మృత్యు శకటాలు

- కర్ర లోడు ట్రాక్టర్లతో ప్రమాదాలు
- అనుమతి లేకుండా యథేచ్ఛగా కర్ర తోలకం
- పట్టించుకోని అటవీ శాఖాధికారులు



శుక్రవారం ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు(ఫైల్)



అర్ధరాత్రి పూట ప్రమాదకరంగా కర్రను తరలిస్తున్న అక్రమార్కులు

పీసీపల్లి: కర్ర లోడు ట్రాక్టర్లు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. నిబంధనలు పాటించకుంటా ఇష్టం వచ్చినట్లు రవాణా చేస్తుండటంతో రెప్పపాటులో ప్రమాదం చోటుచేసుకొని విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రస్తుతం పొగాకు సీజన్ కావడంతో కాల్చుకు అవసరమైన కర్రను భారీగా తరలుతోంది. ఈ క్రమంలో రాత్రిళ్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా.. ?

రెండేళ్ల క్రితం హనుమంతునిపాడు మండలం కూటాగుండ్లకు చెందిన వ్యక్తి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న కర్ర లోడు ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే పీసీపల్లి మండలం మెట్లవారిపల్లి సమీపంలో అర్ధరాత్రి తుమ్మకర్ర వేసుకొని వస్తున్న ట్రాక్టర్ తగిలి వ్యక్తి మృతి చెందాడు. గత శుక్రవారం దివాకరపల్లికి చెందిన చీమలమర్రి వెంకటేశ్వర్లు కందుకూరు నుంచి స్వగ్రామానికి కారులో వస్తుండగా ఎదురుగా వస్తున్న కర్రలోడుతో ఉన్న ట్రాక్టర్ సింగిల్ లైట్ వేసుకొని వచ్చి ఢీకొంది. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు కాగా కారులోని వెంకటేశ్వర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. నరికిన కర్రను ఎవరికీ తెలియకుండా తీసుకెళ్లాలంటే రాత్రి అనువైన సమయం. కొందరు ట్రాక్టర్ యజమానులు సింగిల్ లైట్ వేసుకొని డోర్లు బార్లా తీసి కర్రను లోడ్ చేసి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ట్రాలీ లోడ్‌లో ఉన్నప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలకు తెలుసుకునే వీలుగా వెనుకుండే ట్రాలీ లైట్లు వేయకుండా నడుపుతుండడంతో చీకట్లో కార్లు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

అక్రమంగా తరలుతున్నా..

అక్రమార్కులు అక్రమంగా అడవి కర్రను ట్రాక్టర్ల ద్వారా రాత్రిళ్లు ప్రమాదకరంగా రవాణా చేస్తున్నారు. అధికారుల అవినీతితో కర్ర వ్యాపారులు చెలరేగిపోతున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో చెరువులు, వివిధ ప్రాంతాల్లో ఉన్న కర్రను వ్యాపారులు కొనుగోలు చేసి బ్యారన్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కర్ర కొట్టిన చోట నుంచి బ్యారన్లకు తోలే సమయంలో కర్ర లోడ్ చేసుకున్న వాహనాలు ఎదురుగా వచ్చే వాహనాలకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పొగాకు సీజన్ ప్రారంభం కావడంతో ఎక్కడెక్కడో ఉన్న తుమ్మ, వేప, చిల్ల, నల్ల తుమ్మ, తెల్ల తుమ్మ, సిరిమేని, టేకు తదితర చెట్లను నరికి రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. సామిల్లు, కార్పెంటర్లు వారి ఇష్టానుసారంగా అడవుల్లో ఉన్న వక్షసంపదను నరికివేస్తున్నారు. మండలంలో గతంలో ఇలాంటి సంఘటనలు ఎన్ని జరిగినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్న విమర్శఉంది.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



ఆంజనేయ స్వామి విగ్రహానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం పంచాయతీ పరిధిలోని కంభం కనిగిరి, గుడిపాటిపల్లి వెళ్లే రోడ్డు కూడలిలోని ప్రసన్న ఆంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్టకు అర్చకుల వేద మంత్రాల నడుమ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాజీపురం గ్రామస్తులు మూడు రోడ్ల కూడలిలో 21 అడుగుల ఎత్తయిన స్వామి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ యర్రం రెడ్డి సుబ్బులు, సర్పంచ్ భర్త యర్రంరెడ్డి తిరుపతరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్, సచివాలయ కన్వీనర్ ఏరువ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ గాయం సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గాండ్ల పర్తి ఆదినారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ చిట్టాల నాగార్జున్‌రెడ్డి, విగ్రహ ఏర్పాటుకు చేయిస్తున్న దాతలు కీచరి వెంకట సుబ్బారెడ్డి కుమారులు, గ్రామస్తులు గాయం సుబ్బయ్య, ఏరువ వెంకటనారాయణ తదితరులున్నారు.

గ్యాస్ లీకేజీతోనే పేలుడు

- పేలుడుపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఇంటి మధ్య గదిలో నల్లగా కాలిన ఆనవాళ్లు

కందుకూరు రూరల్: మండలంలోని మాచవరం గ్రామంలో కొండ వద్ద శనివారం రాత్రి ఇంట్లో సంభవించిన పేలుడు గ్యాస్ లికేజీ వల్లే జరిగిందని క్లూస్‌టీం తేల్చిందని రూరల్ ఎస్సై శివనాంచారయ్య తెలిపారు. ఇంట్లో ఉండే తిరుపాలు పది రోజుల క్రితం ఊరికి వెళ్లాడు. వెళ్లేటప్పుడు గ్యాస్ కట్టేయకుండా వెళ్లడంతో గ్యాస్ ఇళ్లంతా గోడలకు అంటుకొని స్టాక్ అయింది. తిరుపాలు శనివారం ఇంటికి వచ్చిన తర్వాత విద్యుత్ దీపాలు వెలించడంతో లైట్ల వేడికి ఒక్కసారిగా మంటలు వచ్చి పేలుడు సంభవించినట్లు పోలీసు అధికారులు చెప్తున్నారు. అయితే గ్యాస్ లికేజీ అయితే వంట గదిలో ఉన్న సిలిండర్ గానీ, గ్యాస్ పైప్ గానీ కాలలేదు. వంట గది గోడలు కూలిపోలేదు. కేవలం మిగిలిన గదుల్లోని గోడలు కూలిపోవడం, తలుపులు పగిలిపోయాయి. ఇంట్లో ఉన్న టీవీకి, టీవీ స్టాండ్, ఫ్రిజ్, దుస్తులకు ఏం కాలేదు. దీనిని బట్టి పరిశీలిస్తే గ్యాస్ లీకేజీ కాదనేది స్థానికుల అనుమానం. అదే విధంగా గ్యాస్ లీకేజై ఇళ్లంతా అవరించి ఉంటే మంటలు వస్తాయి గానీ పేలుడు సంభవించదని మెకానిక్‌లు చెబుతున్నారు. గ్యాస్ సిలిండర్ పేలినప్పుడు ఇలాంటి శబ్దం వస్తుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల నుంచి గ్యాస్ లీకేజీ అయితే కనీసం పక్కింటి వారికి కూడా వాసన రాలేదు. తిరుపాలు ఇంట్లోకి వెళ్లిన గంట తర్వాత పేలుడు సంభవించింది. దీంతోపాటు ఇంట్లోని మధ్య గదిలో బండపై నల్లగా కాలిన ఆనవాళ్లు ఉన్నాయి. దీన్ని బట్టి ఈ సంఘటనపై గ్రామస్తులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

35 మందికి వైద్య పరీక్షలు



టంగుటూరులో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ మాదాసి వెంకయ్య

టంగుటూరు: స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పురం సెంటర్లో నిర్వహించిన ఉచిత ప్రజా వైద్య కేంద్రంలో ఆదివారం పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఒకరికి ఆపరేషన్ అవసరం కాగా..ఉలవపాడులోని తన వైద్యశాలలో ఉచితంగా చేస్తానని డాక్టర్ వెంకయ్య తెలిపారు. ఇంకా ఎవరికైనా ఆపరేషన్లు అవసరమైతే ఉచితంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బొడ్డు శ్రీనివాసరావు, దుగ్గిరాల సునీల్, సత్తల హరిబాబు, బుర్రి చంద్ర, మద్దెల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా విధింపు



స్పీడ్ గన్‌తో పరీక్షించి చలానా విధిస్తున్న ఎస్సై

టంగుటూరు: స్పీడ్ గన్‌తో ప్రమాదాలు నివారించవచ్చని ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద ఎస్సై ఖాదర్‌బాషా స్పీడ్ గన్‌తో ఈ చలానాలు విధించారు. ఈ సందర్భంగా అతివేగంగా వెళుతున్న 101 వాహనాలకు రూ.40,400 జరిమానా విధించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలకు చలానా విధించారు.

కొండపి సోషల్‌మీడియా కన్వీనర్‌గా మహేంద్రచౌదరి

కొండపి: వైఎస్సార్ సీపీ కొండపి మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా అనకర్లపూడి గ్రామానికి చెందిన కొల్లూరి మహేంద్రచౌదరి, కోకన్వీనర్లుగా కుంచాల ప్రసాద్, రంపతోటి చినబ్రహ్మయ్య, షేక్ గుంటూర్‌వలి, యాల్లావుల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. మర్రిపూడి మండల కన్వీనర్‌గా నాగార్జునరెడ్డి, టంగుటూరు మండల కన్వీనర్‌గా కొమ్ము అనీల్, జరుగుమల్లి మండల కన్వీనర్‌గా ముప్పా శ్రీనివాసరావు, సింగరాయకొండ మండల కన్వీనర్‌గా మిడసల జెస్సీపాల్, పొన్నలూరు మండల కన్వీనర్‌గా నాలి దత్తుకుమార్‌తో పాటు కోకన్వీనర్లను నియమించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని సోషల్ మీడియా కన్వీనర్లు పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

అద్దంకి: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వారికి ఉపయోగకరమైన అట్టలు, జామెట్రీలు, పెన్సిల్స్, పెన్నులను రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఆదివారం పట్టణంలోని సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహంలోని 90 మంది విద్యార్థులకు పాత శివాలయం సమీపంలోని లక్ష్మయ్య సేవాసదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అడుసుమల్లి వెంకటేశ్వర్లు సౌజనయతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సాధికారిత అధికారి రాజదెబోరా, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్లాక్లిన్, రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీ కృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, రోటరీ సభ్యులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు

బల్లికురవ: రైతుల గ్రూపులకు నలభై శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారిణ ఎస్‌వీపీ కుమారి ఆదివారం తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ.15 లక్షల వరకు పరికరాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఇందులో రైతు వాటాగా 10 శాతం చెల్లిస్తే, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ లోన్‌తో దఫాల వారీగా చెల్లించవచ్చని చెప్పారు. మండలంలోని 20 ఆర్బీకేల్లో 13 ఆర్బీకేల పరిధిలో యాంత్రీకరణ యూనిట్లను ఇప్పటికే అందించామన్నారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, అంబడిపూడి, వైదన, కొప్పరపాడు, వెలమవారిపాలెం గ్రామాల్లోని రైతు గ్రూపులు యాంత్రీకరణ యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అదాని అక్రమాలపై విచారణ జరపాలి

మార్కాపురం టౌన్: అదాని అక్రమాలపై పార్లమెంట్ స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసి విచారణ జరపాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ వి. సుదర్శన్ ఓ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానికి సన్నితంగా ఉండి కోట్ల మంది భారతీయుల నమ్మకాన్ని ఒమ్ము చేశాడన్నారు. మదుపర్లు దాచుకున్న లక్షల కోట్ల రూపాయలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధాని నోరు విప్పాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్షల కోట్ల రూపాయలకు అదాని అధిపతయ్యాడని విమర్శించారు.

కృత్రిమ అవయవాల పంపిణీ వాయిదా

మార్కాపురం టౌన్: ఈ నెల 16న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పంపిణీ చేయాల్సిన కృత్రిమ అవయవాల కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల అవయవాలు తయారు చేసే సంస్థ వారు రాకపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. పంపిణీ చేసే తేదీ త్వరలో ప్రకటిస్తామని, దివ్యాంగులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

భక్తుల సౌకర్యార్థం డీప్‌బోరు ఏర్పాటు



వెంకటాపురంలో డీప్‌బోర్ వేయిస్తున్న దాత శ్రీనివాసరెడ్డి, నాయకులు

పామూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో గ్రామదేవత నాగార్పమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ యూత్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాసరెడ్డి రూ.2.10 లక్షల సొంతనిధులతో డీప్‌బోర్ వేయించి నీటి వసతి కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భాల్లో, ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు సొంత నిధులతో బోర్‌వేసి నీటి వసతి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలగపూడి నడిపి శివరామయ్య, కాకు సురేష్, కోటపాటి సంజీవరెడ్డి, మారంరెడ్డి కొండలరావు, వెంగయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, చెరుకుల వెంకటేశ్వర్లు, మాలెం అంజిరెడ్డి, వెంకట్రావు, తరుణ్, రమణయ్య పాల్గొన్నారు.

మోపాడు ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరు



మోపాడు ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

- ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

పామూరు: మోపాడు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి పంటలసాగయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని కరోళ్లపాడురోడ్డు వద్ద ఆదివారం ఎమ్మెల్యే మోపాడు రిజర్వాయర్ ప్రధాన కాల్వ ద్వారా పొలాలకు విడుదలవుతున్న సాగునీటిని పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటినుండి సంవృద్ధిగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయన్నారు. పూర్తిగా వర్షాధారితమైన మోపాడు రిజర్వాయర్‌కు సంవృద్ధిగా నీరుచేరడంతో అన్నదాతలు రిజర్వాయర్ ఆయకట్టులో వరి, నూగు, పొద్దుతిరుగుడు, కుసుమ, చెరుకు పంటల సాగు చేస్తున్నారన్నారు. సాగుకు నీటి సరఫరా పూర్తయిన తరువాత రిజర్వాయర్, కాల్వల ఆధునికీకరణ పనులను వేగవంతం చేసి వచ్చే ఏడాదికి పనులను పూర్తయ్యేలా చూడాలని ఎంపీపీ, జెడ్పీటీసీలకు సూచించారు. పండిన పంటలు ఆర్బీకేల్లో కొనుగోలు చేయడంతో రైతులు దళారీల బారిన పడకుండా గిట్టుబాటు ధరలకే పంటలను అమ్ముకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా రైతులతో, కూలీలతో మాట్లాడిన ఎమ్మెల్యే పంటలసాగుపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, సింగిల్‌విండో డైరెక్టర్ చెనికల శ్రీను, నీలం వెంకటేశ్వర్లు, పాలేటి ప్రేమ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొండపిలో రోడ్డు మార్జిన్ ఆక్రమణ

- రోడ్డు వెంట వెలసిన దుకాణాలు
- ట్రాఫిక్, పారిశుధ్య సమస్యతో ప్రజల ఇక్కట్లు



కొండపిలో రోడ్డు మార్జిన్ ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

కొండపి: నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్లు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుంచి జెండా చెట్టు సెంటర్ వరకు, అలాగే వైద్యశాల నుంచి ప్రభుత్వ హైస్కూల్ వరకు రోడ్డు మార్జిన్‌లో కూరగాయల దుకాణాలు, కొబ్బరి బోండాలు, చేపల దుకాణాలు, టీస్టాల్స్ ఏర్పాటు చేశారు. గత నెల రోజులుగా దుకాణదారులు ఒకరిని చూసి మరొకరు తడికెలు ఏర్పాటు చేశారు. సిమెంటు రోడ్డు వరకు ఆక్రమణలు ఉండటంతో వాహనదారులు, ఆటోవాలాలు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ప్రజల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది. పందులు కూరగాయల వ్యర్థాలు తింటూ మలమూత్ర విసర్జన చేస్తున్నాయి. పంచాయతీ, ఆర్అండ్‌బీ, పోలీసులు అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోవడం లేదు. జెండా చెట్టు సెంటర్‌లో ఒక వ్యక్తి రోడ్డు మార్జిన్ ఆక్రమించి మరో ముగ్గురికి అనధికారికంగా అద్దెకు ఇవ్వడంతో ఆ పంచాయతీ పోలీసుల వరకు చేరింది. ఈ ఆక్రమణల పర్వం మరిన్ని గొడవలకు దారితీసి శాంతిభద్రతల సమస్య తలెత్తకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరముందని కొండపి వాసులు అభిప్రాయపడుతున్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మహా నివేదన పూజలు చేస్తున్న భక్తులు



విగ్రహాలకు పూజలు చేస్తున్న పూజారులు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 18న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నారాయణస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షా బంధనం, పంచామృత అభిషేకం వేద పారాయణ, కలశ స్థాపన, నవగ్రహారాధన, అగ్ని ప్రతిష్టాపన, గణపతి హోమం, ఆదిత్య హృదయ హోమం, కూష్మాండ హోమాలు, గోపూజ మహా నివేదన పూజలు నిర్వహించారు. మహా నివేదన పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్లు చేత పట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పుట్ట మట్టి తీసుకువచ్చిన తర్వాత స్వామి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రికి శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి నారాయణస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆశ్రమంలో అన్నదానం



వికలాంగులకు భోజనం పంపిణీ చేస్తున్న నిహిత బంధువులు

కందుకూరు అర్బన్: పట్టణానికి చెందిన జయవరపు కిషోర్, కనకమహాలక్ష్మి కుమార్తె వెంకటసాయి నిహిత పుట్టినరోజు వేడుకను కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. అదే విధంగా పట్టణంలోని పేదలకు, నిరాశ్రయులకు అల్పాహారం పంపిణీ చేశారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.